క్లుప్తంగా

శెట్టిబలిజ విద్యార్థులకు ఉపకార వేతనాలు

రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు



సీటీఆర్ఐ: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన శెట్టిబలిజ సంఘీయ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వరనగర్‌లో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు స్థానిక గోదావరి గట్టున కెరెంట్ ఆఫీస్ ఎదురుగా శ్రీత్యాగరాజ నారాయణదాస కల్యాణ మండపంలో 230 మంది విద్యార్థులకు రూ.13 లక్షల ఉపకార వేతనాలు అందించనున్నట్లు చెప్పారు. ఇందులో రూ.10 లక్షలు మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో సీఎస్సార్ కింద గోద్రెజ్ సంస్థ మంజూరు చేయగా, మిగిలిన రూ.3 లక్షలు తన వ్యక్తిగత కార్యక్రమం కింద కేటాయించినట్టు వివరించారు. పదో తరగతిలో 500 నుంచి 549 మార్కులు వచ్చిన వారికి రూ.3,500, అలాగే 550 నుంచి 574 మార్కులకు రూ.5 వేలు, 574 నుంచి 600 మార్కులకు రూ.10 వేల ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపారు.

విజిలెన్స్ అవగాహన సదస్సు

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అవగాహన సదస్సు జరిగింది. గుంటూరు విజిలెన్స్ హెడ్ ఆఫీస్‌కు చెందిన విజిలెన్స్ అధికారి ఈ.రాంబాబు, రీజినల్ మేనేజర్ జి.శ్రీనివాసరావు హాజరై అవినీతి రహిత సమాజం అనే అంశంపై మాట్లాడారు. అందరూ అవినీతి రహిత సమాజానికి పాటుపడాలని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సి.శాంతరాం, ఉద్యోగులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కంబాలచెరువు: అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, శ్రీనివాస రామానుజం ఉన్నత పాఠశాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎంలు యూ.విజయలక్ష్మి, సత్యవతి, ఏఎన్ఎం కమల మాట్లాడుతూ, విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. మానసిక ఆరోగ్యం కోసం యోగా సాధన చేయాలని, దీనివల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోటూరి మంగారాణి, పీవీవీ రమణ, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా వర్కర్ దేవి, మ్యాజిక్ బస్సు టీఎంవో ప్రియాంక, వైఎం దివ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి ఫార్మేటివ్-2 పరీక్షలు



ప్రశ్నాపత్రాల బండిళ్లను భద్రపరుస్తున్న డీఐ

కంబాలచెరువు: అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 13వ తేదీ నుంచి ఫార్మేటివ్-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ వారు ఇచ్చిన ప్రశ్నాపత్రాల బండిళ్లను స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భద్రపరిచారు. ప్రతి పరీక్షకు ప్రశ్నాపత్రాలను గంట ముందు ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేస్తారని డీఐ తెలిపారు. విద్యార్థులకు అందజేసిన మూల్యాంకన పుస్తకాల్లో ప్రాజెక్టు వర్కులు, మిగిలిన టూల్స్ మూల్యాంకనం పూర్తి చేసి ఈ పరీక్షకు సిద్ధపడాలన్నారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పి.ప్రసాద్, కుమారి, కోటేశ్వరి, నాగలక్ష్మి, ఇందిర, సునీత పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో జీవిత కాలం వృద్ధి



బుద్ధ విహార్‌లో ఔషధ మొక్కల సాగు రైతులతో రవివర్మ, చంద్రశేఖర్

కడియం: ఔషధ మొక్కలను రక్షించి మానవుని జీవితకాలాన్ని పెంచుకోవాలని ఆయుర్వేద వైద్యులు రవివర్మ, ఔషధ, సుగంధ ద్రవ్యాల బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆవుల చంద్రశేఖర్ రైతులకు సూచించారు. శుక్రవారం వేమగిరి బుద్ధ విహార్‌లో గాదరాడ గ్రామానికి చెందిన ఔషధ మొక్కల సాగు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మొక్కల్ని పెంచడం వలన రేపటి తరాలకు మేలు చేసినట్టవుతుందన్నారు. రైతుల అభ్యర్థన మేరకు వేమగిరిలో ఔషధ మొక్కల నర్సరీ మంజూరు చేస్తామని తెలిపారు.

వీరు గోల్డ్ అంతే..

- వివిధ క్రీడల్లో సత్తాచాటి పతకాలు కైవసం
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారుల ప్రతిభ

ప్రకాశం నగర్: నగరానికి చెందిన విద్యార్థిని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. క్రికెట్, కరాటే, వెయిట్‌లిఫ్టింగ్ వంటి క్రీడల్లో రాణించి పతకాలు సాధించడమే కాకుండా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై రాజమహేంద్రవరం ఖ్యాతిని దశదిశల వ్యాప్తి చేస్తున్నారు. ఇటీవల ఒంగోలులో జరిగిన ఆలిండియా కరాటే చాంపియన్ షిప్‌లో రాజమహేంద్రవరం సిటీ, ధవళేశ్వరానికి చెందిన క్రీడాకారులు శ్రీలాస్య, భవిష్య, గణేష్, పూజ, శ్రీలక్ష్మి లత, లక్ష్మి భవానీ అండర్- 10, 14, 17, 19 విభాగాల్లో బంగారు పతకాలు సాధించగా, ఏంజిలరింబిక, జాన్ మలాకీలు వెండి పతకాలు సాధించారు. రోషన్, వికాస్ నారాయణ, శశాంక్, నవ్యశ్రీ దుర్గ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో 'గోల్డ్' జూహిత

లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని జూహిత గుణ ఇంఫాల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. గత ఏడాది ఇదే పోటీల్లో కాంస్య పతకం సాధించిన జూహిత, ఈ ఏడాది జరిగే పోటీల్లో బంగారు పతకం సాధించడం గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా జూహిత గుణను ఘనంగా సత్కరించారు.

ఏపీఎల్‌లో బెస్ట్ ఎకానమిక్ బౌలర్‌గా భార్గవి

నగరానికి చెందిన భార్గవి ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)లో బెస్ట్ ఎకానమిక్ బౌలర్‌గా ప్రతిభ చాటింది. ఇటీవల్ల విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో సత్తాచాటిన భార్గవి రూ.40 వేల నగదు బహుమతిని సాధించింది. ఏపీ స్టేట్ అండర్-19 ప్రాబబుల్స్ మ్యాచ్‌లో అత్యధికంగా 15 వికెట్లు సాధించింది. నగరం నుంచి ఆంధ్రా అండర్-19 టీ20 టీంకు ఎంపికైంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ అక్కిం బాషా పర్యవేక్షణలో ఈ నెల 25వ తేదీన ఔరంగాబాద్‌లో జరిగే అండర్-19 స్టేట్ మ్యాచ్‌లో భార్గవి ఆడనుంది.



ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో సత్తా చాటిన భార్గవికి రూ.40 వేల చెక్కు అందిస్తున్న నిర్వాహకులు

ఆనందంగా ఉంది



వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించాను. అంతర్జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్నాను. చదువుతో పాటు, క్రీడల్లోను రాణించి మంచి పేరు తెచ్చుకోవడమే నా లక్ష్యం.

– జూహిత గుణ, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు



పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యాధికారులు

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కంబాలపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని పీఎంఎస్ బాలికల వసతి గృహం, ఎస్టీ బాలుర వసతి గృహాల వద్ద సికిల్‌సెల్ ఎనీమియాపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. విద్యార్థులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సికిల్‌సెల్ అనీమియా అనేది జన్యులోపంతో వస్తుందన్నారు. జన్యు మార్పిడి వలన ఏర్పడే హిమోగ్లోబిన్ ఎర్ర రక్త కణాలను కొడవలి, నెలవంక ఆకారంలో మారుస్తుందన్నారు. దీనివల్ల రక్తహీనత, అలసట, బలహీనత, కణజాల నష్టం, తరచుగా అంటువ్యాధులు రావడం, నొప్పిగా ఉండడం సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంకే అనూహ్య, సూపర్‌వైజర్ డీడీ భవాని, హాస్టల్ వార్డెన్ క్రాంతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆకుల పరామర్శ



త్యాగరాజును పరామర్శిస్తున్న ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి, శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజును శుక్రవారం పార్టీ సీఈసీ సభ్యుడు ఆకుల వీర్రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా త్యాగరాజు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పార్టీ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, జిల్లా కార్యదర్శి ముద్దాల అను, భాస్కరరావు పాల్గొన్నారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్ దుర్గామణి

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఆధ్వర్యంలో బొమ్మూరు జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గామణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పూల వ్యర్థాలతో అగరుబత్తుల తయారీ స్ఫూర్తిదాయకం

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

కడియం: హార్టికల్చర్ వ్యర్థ పూలతో మహిళలు అగరుబత్తులు తయారు చేయడం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అభినందించారు. మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఆదాయ వనరులను సృష్టించడం ప్రశంసనీయమన్నారు. శుక్రవారం కడియం ప్రాంతంలోని వ్యర్థ పూలతో అగరుబత్తుల తయారీ యూనిట్, కొబ్బరి తాళ్ల తయారీ యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందిన మహిళలతో సమావేశమై, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ దిశలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇదే రంగంలో మరిన్ని యూనిట్లు స్థాపించేందుకు సహకరించాలని మహిళలు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిమాండ్‌కు అనుగుణంగా యూనిట్ స్థాపన ఉండాలన్నారు. భవిష్యత్తులో ఏర్పాటు చేసే యూనిట్ల విషయంలో ముడి సరకు లభ్యత నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి అంశాన్ని క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి, ఆ మేరకు కచ్చితత్వం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళల చొరవతో కడియం నాచురల్ అగరుబత్తులు అనే ప్రత్యేక బ్రాండ్ రూపుదిద్దుకోవడం గర్వకారణమని వ్యాఖ్యానించారు. కెనరా బ్యాంక్ సహకారంతో తొలి దశలో 12 మంది మహిళలు యూనిట్ స్థాపనకు ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. మొత్తం 52 మంది మహిళలు శిక్షణ పొందగా, ఇతర మహిళలు కూడా ఇలాంటి యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పూల మార్కెట్‌ను సందర్శించి, పూల వ్యర్థాల వినియోగం, హార్టికల్చర్ ఆధారిత ఉపాధి అవకాశాల వివరాలు తెలుసుకున్నారు. పర్యాటక రంగంలో ఈ ప్రాంతంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, జిల్లా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అధికారి కె.శ్రీనివాస్, ఏపీఎంఐడీసీ పీడీ దుర్గేష్, హార్టికల్చర్ అధికారి ఎన్.మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



కలెక్టర్ కీర్తి చేకూరికి అగరుబత్తులు అందజేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

నర్సరీ సందర్శన

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలోని ప్రత్యేకమైన వృక్షాల పెంపకం, పచ్చదన కార్యక్రమాలు, ఆధునిక పద్ధతుల్లో మొక్కల ఉత్పత్తి విధానాలను కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు నర్సరీ అధినేత పుల్లా పెద్దసత్యనారాయణ కలెక్టర్‌కు ప్రత్యేక మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, నర్సరీ నిర్వహణను ప్రశంసిస్తూ, పర్యావరణ పరిరక్షణలో ఇలాంటి ప్రయత్నాలు మరింతగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఆమె వెంట స్థానిక అధికారులు, గ్రామ ప్రముఖులు ఉన్నారు.



కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న పెద్దసత్యనారాయణ

నేతలపై తీవ్ర స్థాయిలో అణచివేత ధోరణి

తపాలా ఉద్యోగుల సంఘ డివిజన్ కార్యదర్శి కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగ సంఘాలను, నాయకులను అణిచివేసే చర్యలు దశాబ్ద కాలంగా దేశంలో తీవ్ర స్థాయిలో నెలకొంటున్నాయని రాజమహేంద్రవరం డివిజన్ తపాలా ఉద్యోగుల సంఘ కార్యదర్శి బి.కొండబాబు ధ్వజమెత్తారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు నాయకత్వం వహించిన కారణంగా అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహదేవయ్యను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడం దారుణమని మండిపడ్డారు. శుక్రవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద రాజమహేంద్రవరం డివిజన్, రామచంద్రాపురం బ్రాంచ్ తపాలా ఉద్యోగుల సంఘం, అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో మహదేవయ్యకు డిపార్ట్‌మెంట్ ఇచ్చిన రిమూవల్ ఫ్రమ్ సర్వీస్ ఆర్డర్‌పై నిరసిస్తూ, దీనిని వెంటనే రద్దు చేయాలన్న డిమాండ్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ, సమ్మె చేసిన కాలానికి జీతభత్యాలను రద్దు చేయడమే కాకుండా, ఇదివరకే ఆయనకు జీతంలో కోత పనిష్మెంట్ విధించారన్నారు. రివ్యూ పేరుతో ఉద్యోగం నుంచి తొలగించడం తీవ్రమైన చర్య అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ యూజీ ప్రకాష్, పోస్ట్‌మెన్, ఎంటీఎస్ యూనియన్ కార్యదర్శి జేవీ సతీష్, జీడీఎస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వై.స్వర్జన్ రాజు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన అవసరం

ఏఎస్పీ మురళీకృష్ణ

కంబాలచెరువు: సమాజంలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా యాప్స్‌తో ఎన్నో నష్టాలు జరుగుతున్నాయని, వాటిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్, మహిళల రక్షణపై పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ, మహిళలు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్‌లను నేర్చుకోవాలన్నారు. మహిళలంతా శక్తి యాప్ డౌన్ చేసుకోవాలని సూచించారు. తద్వారా ఏ సమయంలోనైనా పోలీసుల సహాయం కోరవచ్చన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, గుర్తు తెలియని, అపరిచితులతో ఫోన్ కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్ చాటింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పవద్దన్నారు. వ్యక్తిగత, బ్యాంక్ ఖాతా వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్లలో పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయాలంటూ వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైం.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలుసుకోవాలని చెప్పారు. యువత చెడు అలవాట్లవైపు ఆకర్షితులైతే తీవ్ర నష్టాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.మంగాదేవి, సబ్ ఇన్‌స్పెక్టర్ అమీనా బేగం, జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వై.సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

విద్యాభివృద్ధికి బోధనా పరికరాలు దోహదం

దర్శకుడు, సినీ నటుడు కాశీవిశ్వనాథ్

సీతానగరం: బోధనాభ్యస పరికరాలు విద్యార్థుల అభివృద్ధికి దోహదపడతాయని సినీ దర్శకుడు, నటుడు వై.కాశీవిశ్వనాథ్ అన్నారు. శుక్రవారం పురుషోత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గోరంట్ల దాసయ్య, శేషారత్నం దంపతుల జ్ఞాపకార్థం అమెరికాలో ఉంటున్న వారి కుమారుడు గోరంట్ల వాసుబాబు బోధనా పరికరాలను పంపించారు. ఉపాధ్యాయులు చిట్టిబాబు, ఎల్ఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో హెచ్ఎం సంతోషిమాత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సినీ నటుడు కాశీ విశ్వనాథ్, ఎంఈఓ కె.స్వామినాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ, అమెరికాలో ఉంటున్నా, తెలుగు రాష్ట్రాలపై ఉన్న అభిమానంతో ఇప్పటి వరకు 290 పాఠశాలలకు బోధనా పరికరాలు ఇచ్చి విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతున్న వాసుబాబు అభినందనీయుడని కొనియాడారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు బోధనా పరికరాలు ఉపయోగపడతాయని ఎంఈఓ స్వామినాయక్ చెప్పారు. అనంతరం రూ.25 వేల విలువైన బోధన పరికరాలను కాశీవిశ్వనాథ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పాట్టియ్య, అతిథి ఉపాధ్యాయులు గుప్తా, పాపారావు, ఫణిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బోధనా పరికరాలను పరిశీలిస్తున్న కాశీవిశ్వనాథ్, స్వామినాయక్

శ్రీవారి విగ్రహాలకు జలాధివాసం



బలభద్రపురం ఆలయంలో జలాధివాసంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పన్నెండు నదుల నీటితో జలాధివాసం నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నూతన నిర్మించిన శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తి పీఠ సహిత పరివార దేవతా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రెండో రోజు 41 మంది దంపతులతో గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిరాశ్రయుల కేంద్రాన్ని వినియోగించుకోవాలి

అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: పట్టణ నిరాశ్రయుల సంక్షేమానికి, ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేస్తామని, దీనిని వినియోగించుకుని నిరాశ్రయులు అభివృద్ధి చెందాలని కార్పొరేషన్ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కంబాలచెరువు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర్ మాట్లాడుతూ, అందరూ ఏదో ఒక పని చేసుకుంటూ, రాత్రి సమయాల్లో నిరాశ్రయుల కేంద్రాన్ని ఉపయోగించుకుని, తిరిగి మరలా కుటుంబానికి చేరేలా ప్రయత్నించాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నగరంలో నిరాశ్రయులను చేరదీసి, వారికి నిత్యం భోజన సౌకర్యం కల్పించడంతో పాటు, దుస్తుల పంపిణీ, కౌన్సెలింగ్ చేయడంతో పాటు, ఇంకా ఎన్నో సమాజోపయోగ సేవలందిస్తూ, నిరాశ్రయుల కేంద్రాన్ని చక్కగా నిర్వహిస్తుందన్నారు. అంతకుముందు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, సంస్థ సభ్యులు

ఎవరో శంకుస్థాపన చేస్తే..!

- మేం పూర్తి చేయాలా అంటున్న కూటమి నేతలు
- కలవచర్ల-రాజానగరం రోడ్డు దుస్థితి
- అభివృద్ధి చేయక ప్రయాణికుల పాట్లు
- వర్షం పడితే ప్రయాణం నరకమే..

రాజానగరం: పాలకులు మారినా అభివృద్ధి ఆగకూడదనేది ప్రజాస్వామ్యంలో ప్రధాన సూత్రం. రాజానగరం నియోజకవర్గంలో మాత్రం ఇది అమలు కావడం లేదు. గతంలో చేపట్టిన పనులతో మాకు ఏమాత్రం సంబంధం లేదన్నట్టుగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు రాజానగరం జాతీయ రహదారి నుంచి కలవచర్ల మీదుగా గాదరాడకు డబుల్ లేన్లుగా విస్తరిస్తూ చేపట్టిన రోడ్డు పనులే నిదర్శనమంటున్నారు.

గత ప్రభుత్వంలో రూ.185 కోట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధిక ప్రాధాన్యమిచ్చారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్ల నిధులు తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో పనులు పూర్తి కాలేదు. ఇటువంటి వాటిలో రాజానగరం జాతీయ రహదారి నుంచి కలవచర్ల, సీతారామపురం మీదుగా గాదరాడకు ఉన్న రోడ్డు ఒకటి. దీనిని రూ.21 కోట్ల వ్యయంతో డబుల్ లేన్‌గా అభివృద్ధి పరుస్తూ 2023లో పనులు ప్రారంభించారు. భూసేకరణ చేసి, పనులు ప్రారంభించడంలో ఆలస్యం కావడంతో పనులు పూర్తి కావడంపై ప్రభావం చూపింది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి కావాల్సిన ఈ రోడ్డు పనులు, ఎన్నికల నగరా మోగే సమయానికి 90 శాతం వరకు మాత్రమే జరిగాయి. ఎన్నికల తరువాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని అంతా భావించారు. ఏళ్లు దాటుతున్నా ఆ రోడ్డు వైపు చూసిన వారు లేరు.



రాజానగరం-కలవచర్ల రోడ్డులో తేలిన కంకర రాళ్లు

పనులు పూర్తయ్యేనా?

జాతీయ రహదారిపై రాజానగరం జంక్షన్ నుంచి కలచవర్ల, సీతానగరం మీదుగా గాదరాడకు డబుల్ లేన్ రహదారి విస్తరణ పనులు గ్రావెల్ వర్క్స్ వరకు పూర్తయ్యాయి. తారు మిక్సింగ్ వేసే ప్రక్రియ జరగాల్సి ఉంది. ఈ పనులు జరగకపోవడంతో ప్రస్తుత్తం ఆ రోడ్డుపై వేసిన గ్రావెల్ లేచి, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో వీరి పాట్లు వర్ణనాతీతమే. ముఖ్యంగా వర్షాలు కురిస్తే ఈ రోడ్డుపై ప్రయాణించలేకపోతున్నారు. రోడ్డుపై పడిన గోతుల్లోకి వర్షం నీరు చేరి, ఏది రోడ్డో, ఏది గొయ్యో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ఈ రోడ్డుపై ప్రయాణించలేక చాలామంది గండేపల్లి మండలం, మురారి మీదుగా చుట్టూ తిరిగి రాజానగరానికి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



వర్షాలకు కంకర రాళ్లు కొట్టుకుపోయి ఏర్పడిన గోతులు